క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

చింతపల్లిరూరల్: మండలంలో శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పర్యటించనున్నట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు. లోతుగడ్డలో ఉదయం 9 గంటలకు గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ, 10 గంటలకు చౌడుపల్లిలో జగనన్న సురక్ష, అనంతరం 2 గంటలకు అంజలి శనివారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అధికారులు తమ వద్ద ఉన్న వివరాలతో హాజరుకావాలని కోరారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొవాలని తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి మండల సమస్యలు


జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను కలిసిన జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, నేతలు

చింతపల్లి రూరల్: గిరిజనుల సమస్యలు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకెళ్లామని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తెలిపారు. గురువారం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్‌ను విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రోడ్డు సమస్యలు వివరించినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కోఆప్షన్ సభ్యులు గణబాబు, మోహన్‌రావు, నాయకుడు అశోక్ ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


భక్తులకు భోజనాన్ని వడ్డిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

కొయ్యూరు: సింగవరం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్ భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఐ స్వామినాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దైవ భక్తితో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

సమయపాలన తప్పనిసరి


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో రామచంద్రరావు

పాడేరు రూరల్: మండల పరిషత్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం సక్రమంగా అందజేయాలని ఎంఈవో ఎస్.రామరాచంద్రరావు సూచించారు. మండలంలోని పాత పాడేరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల బయోమెట్రిక్ విధానంపై ఆరా తీసి పలు, సలహాలు, సూచనాలు చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో జగనన్న విద్యా కానుక కిట్లను సరఫరా చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ


కళ్లద్దాలు అందుకున్న విద్యార్థులతో వైద్యాధికారి శిరీష

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-2, బాలికల పాఠశాల-1లలో గురువారం జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 14 మంది విద్యార్థులకు కళ్లద్దాలను వైద్యాధికారి శిరీష పంపిణీ చేశారు. మొదట కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు పరీక్షలు చేశారు. వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ కంటి సమస్య ఉన్న వారు నేత్ర పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా నేత్ర పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లద్దాలు అందిస్తోందన్నారు. హెచ్‌ఎం లక్షణుడు, ఎంపీహెచ్‌వో కిషోర్, ఉపాధ్యా యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

- రోడ్లతో మారిన రూపురేఖలు
- గిరిజనుల హర్షం


ముంచంగిపుట్టులో దూర్గగూడలో వేసిన సీసీ రోడ్డు


జర్రిపాడ గ్రామంలో తారురోడ్డు

ముంచంగిపుట్టు: గ్రామాల వీధుల్లో బురదమయంగా మారి అవస్థలు పడ్డ గిరిజనులకు గడప గడపకు మన ప్రభుత్వం, జెడ్పీ నిధులతో ఆ సమస్య తీరింది. గత మూడు నెలల వ్యవధిలో ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో 48 సీసీ ర్యాంప్‌లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేయడం జరిగింది. గతంలో వర్షం పడితే గ్రామాలలోని విధులు బురద బురదగా మారి కాలినడకన వేళ్లేందుకే కష్టంగా ఉండేది. వాహనాలు బురదలో కూరుకుపోయి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వారి సమస్యలను గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రల దృష్టికి గిరిజనులు తీసుకురావడంతో సీసీ ర్యాంప్‌లు వేసి సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గడప గడప నిధులు ఒక్కో పంచాయతీకి రూ.40లక్షలు చొప్పున కేటాయించారు. జెడ్పీ నుంచి సైతం రూ.20 నుంచి రూ.30 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో 11 పంచాయతీల్లో రూ.5 నుంచి రూ.15 లక్షలతో 100 నుంచి 500 మీటర్ల సీసీ ర్యాంపులను పంచాయతీ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ద్వారా అత్యంత వేగంగా వేశారు. దీంతో వర్షాకాలంలో గ్రామాల్లో బురదయంగా ఉండే విధులు సీసీ ర్యాంప్‌లతో అందంగా మెరిసిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్పందించిన తీరుపై హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

రహదారులకు మోక్షం

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపాడ, గతుమలడ, వెచ్చంగిపుట్టు గ్రామస్తుల తారురోడ్డు కల ఎన్నో ఏళ్ల తర్వాత నేరవేరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామాలకు తారురోడ్డు వేయాలని పాలకులు, అధికారులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రహదారికి మోక్షం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ నిధులు రూ.1.20 కోట్లతో తారురోడ్డు వేయడంతో ఆయా గ్రామాలకు రహదారి కష్టాలు తీరాయి. దీంతో ఆయా ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం సైతం కల్పిస్తే రవాణా కష్టాలు తీరుతాయని చెబుతున్నారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు


దారపల్లిలో వరినాట్లు వేస్తున్న గిరిజన రైతులు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గిరిజన రైతులు జోరుగా వరినాట్లు పనులు చేపడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మెట్ట భూముల్లో సైతం వరి సాగుకు భూమి సిద్ధం చేస్తూ దుక్కులు చేపడుతున్నారు. వర్షాలతో నారు మడులు నీటి నిలువలతో కళ కళలాడుతున్నాయి. గిరిజనులంతా గ్రామ సమీపంలో ఐక్యమత్యంగా వరి నాట్లు వేస్తూ వ్యవసాయ పాటలు పాడతూ సందడి చేస్తున్నారు. మండలంలో 23 పంచాయతీల్లో 378 గ్రామాల్లో ఏ ప్రాంతంలో చూసిన వ్యవసాయ పనులు చేస్తూ గిరిజనులు బిజీగా కనిపిస్తున్నారు. మండలంలో 50 శాతం పొలం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రభుత్వం సకాలంలో రైతు భరోసా సొమ్ము అందడం, వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు పంపిణీ చేయడం వ్యవసాయ పనులు జోరుగా జరుగుతున్నాయని గిరజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డుంబ్రిగుడ: మన్యంలో అడప దడపా వర్షాలు పడడంతో గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొద్ది రోజులుగా వేసవి ప్రభావంతో కొన్ని చోట్ల సాగునీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే ఇటీవల వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో నీరు బాగా చేరింది. దీంతో రైతులు దుక్కు పనులు, విత్తనాలు జల్లుడంతో పాటు నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. సొవ్వ పంచాయతీలో పలు గ్రామాల్లో చోడి నాట్లు వేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో చోడితో పాటు ఇతర వ్యవసాయ పనులను ముమ్మరం చేస్తున్నారు.


సొవ్వలో చోడి నాట్లు వేస్తున్న గిరిజనులు

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ తప్పనిసరి


డుంబ్రిగుడలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ నరసింహులు, చిత్రంలో డాక్టర్లు గౌతమ్, రాజశ్రీ


హుకుంపేటలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ డాక్టర్ చరణ్


అనంతగిరిలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ నరసింహులు

అనంతగిరి/అరకులోయటౌన్: పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహులు అన్నారు. అరకులోయ, అనంతగిరి మండలాల్లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ కుక్కలను పెంచుకుంటున్న, యాజమానులు తప్పనిసరిగా ప్రతి ఏటా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వెటర్నరీ డాక్టర్లు గణేశ్వరరావు, సందీప్, గౌతమ్, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ నరసింహులు ఆధ్వర్యంలో కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం కించుమండ పశుసంవర్ధక శాఖ కార్యాలయం, పోతంగి రైతు భరోసా కేంద్రాలను కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పశుసంవర్ధక శాఖ వెటర్నరీ డాక్టర్లు గౌతమ్ ,రాజశ్రీ, సిబ్బంది దివ్య, సుబ్బారావు, త్రినాథరావు, అనంతరావు తదితరులున్నారు.

హుకుంపేట: మండల కేంద్రాంలోని స్థానిక పశు వైద్యా శాలలో గురువారం ఘనంగా జూనోసిస్ డే నిర్వహించారు. 20 కుక్కలకు యాంటి రేబీస్ వ్యాక్సినేషన్ వేసినట్లు పశువైద్యాధికారి చరణ్ తెలిపారు. ఈ వ్యాక్సిన్ ద్వారా కుక్కల నుంచి మనుష్యులకు అంటు వ్యాధులు రాకుండా ఉంటదని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం వాయిదా

కొయ్యూరు: పలకజీడిలో శుక్రవారం జరగాల్సిన మెగా వైద్య శిబిరాన్ని వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో వాయిదా వేసినట్టు సీఐ స్వామినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన


గిరిజనులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీపీ రమేష్ తదితరులు


మద్దిపుట్టులో గిరిజనులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో జెడ్పీటీసీ మత్స్యలింగం తదితరులు

- జోరు వానలో కొనసాగిన గడప గడపకు
- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణకు గ్రామస్తుల ఘన స్వాగతం

కొయ్యూరు: జోరు వానలో కూడా మన్యంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. దీంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది.

మండంలోని నడింపాలెం, గింజర్తి, ఎం.మాకవరంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు. హోరు వానలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 273 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.40లక్షలు కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎం జగనన్న అందిస్తున్న సుపరిపాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్ పర్సన్ రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు బిడిజన అప్పారావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, సర్పంచ్‌లు కోడా చింతల్లి, సెగ్గే రమాదేవి, తహశీల్దారు తిరుమలరావు, ఎంపీడీవో లాలం సీతయ్య, నాయకుడు సత్యనారాయణ, మండల కన్వీనర్ బండి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

హుకుంపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో గిరిజన పేదలకు మేలు జరిగిందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని భీమవరం పంచాయతీ మద్దిపుట్టు, అండిభ పంచాయతీ కేంద్రంతో పాటు అడపరాయి, నక్కగొయ్యి, బంగారుబుడి గ్రామల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన గురువారం పర్యటించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జోరు వానను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే పాల్గుణ ఆయా గ్రామాల్లో 286 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేకంగా ప్ర భుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామల్లో మౌలిక సదుపాయల కల్పనకు ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా సంతోషంగా జీవిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపిస్తామని గిరిజనులు ఎమ్మెల్యే పాల్గుణ ముందు ప్రతిజ్ఞ చేశారు .జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, నైని సన్నిబాబు, ఎంఎల్‌వో శివరామ్, నాయకులు భూషణ్, కొండబాబు, పాటి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు


పెదార్యూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


జీకే వీధిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఎంపీపీ కుమారి తదితరులు


పెదగూడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ బాబూరావు, అధికారులు, నేతలు


వై.రామవరంలో ధ్రువీకరణ పత్రాలతో లబ్ధిదారులు, చిత్రంలో ప్రజాప్రతినిధులు

అనంతగిరి: గుమ్మకోట, బొర్రా పంచాయతీల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో అందరికీ ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం గిరిజనులకు ఒక వరమని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుమ్మకోటలో 1556, బొర్రాలో 741 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీవో కుమార్, సర్పంచ్‌లు పాగి అప్పారావు, జన్ని అప్పారావు, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యానారాయణ, ఎంపీటీసీ తౌటినాయుడు, కో-ఆప్షన్ సభ్యుడు మదీనా, అరకు సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ రాము తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ బోయిన కుమారి మా ట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు ధ్రువపత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం, సర్పంచ్‌లు పాండు, రామకృష్ణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ ఎం.సత్యనారాయణ, వైస్ సర్పంచ్ ఆనంద్, మాజీ ఎంపీటీసీ కంకిపాటి రామారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 485 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ముంచంగిపుట్టు: పెదగూడ, భూసిపుట్టు పంచాయతీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బాబురావు, తహసీల్దార్ నర్సమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గణపతి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, జేసీఎస్ మండల కన్వీనర్ కొండలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని పెదార్యూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారమవుతాయన్నారు. తహసీల్దార్ కె.అనసూయ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎంపీటీసీ సభ్యురాలు ధర్ముల అమ్మాజీ, సర్పంచ్ సున్నం అభిరామ్, నాయకులు పూసం ప్రసాద్, ధర్ముల పిచ్చయ్య, సంకురు, వెంకన్నబాబు, కార్యదర్శి శివకుమార్, వీఆర్వో రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష పేదలకు ఓ వరం లాంటిదన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, డీటీ కె.సుధాకరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల త్రిమూర్తులు, కన్వీనర్ కనకరాజు, గృహ సారథులు నారాయణరావు, ఈవోపీఆర్డీ మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 160 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. దారగడ్డలో జరిగిన కార్యక్రమంలో 150 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు సాదాల లక్ష్మమ్మ, సర్పంచ్ జి.మాధురి, ఏపీవో ప్రకాశబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: కల్లేరులో జరిగిన కార్యక్రమంలో 259 మందికి, కుమ్మూరులో 105 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీడీవో వెంకటరత్నం, సర్పంచ్ ముచ్చక నాగార్జున, మండల ప్రత్యేకాధికారి విజయగౌరి, ఆర్ఐ దేవయ్య, కార్యదర్శులు రఘుబాబు, సురేష్ పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని వీరవరంలో జరిగిన కార్యక్రమంలో 690 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీవో కె.బాపన్నదొర, సర్పంచ్ ఆగూరి వీర వెంకటరెడ్డి, ఈవోపీఆర్డీ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గన్నవరంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ముంపునకు గురవుతున్న గ్రా మాలను పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని కోరుతూ తహసీల్దార్‌కు పలువురు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఎంపీటీసీ సభ్య డు కంటె రాజు, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.


గుమ్మకోటలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, తహసీల్దార్, తదితరులు


కల్లేరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


ఎటపాకలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు


వీరవరంలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో బాపన్నదొర, సర్పంచ్ వెంకటరెడ్డి

వాలీబాల్ కిట్‌ల పంపిణీ

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం, కొయ్యూరులో నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులకు సంస్థ తరఫున వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.

ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ఉన్నత విద్య చదవాలన్నారు. అరక ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశాల మేరకు క్రీడల్లో యువతను ప్రొత్సహించేందుకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు నర్సి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం.. ఆనందంలో గిరిజనం

- గౌరీదేవిపేట పీహెచ్‌సీలో పెరుగుతున్న ఓపీ
- ప్రతి గురువారం కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు


ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

ఎటపాక: మండలంలోని గౌరీదేవిపేట పీహెచ్‌సీకి నిత్యం వంద మందికి పైగా వైద్య సేవలు పొందుతున్నారు. గురువారం 11 మంది మహిళలకు కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స చేసినట్టు వైద్యులు టి.వి.శేషిరెడ్డి, దేవినాగ్ చెప్పారు. వీటితో పాటు ఐదుగురికి ప్రసవాలు చేశామన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. సత్వరమే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రతీ రోజు ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుంది. ప్రతీ గురువారం కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు చేస్తున్నట్టు డాక్టర్ శేషిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపడడంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.